www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 11 జులై 2025

వైవీయూ అధికారుల తీరుపై విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి -కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలోని హెల్త్ సెంటరులో 2 నెలలుగా మందులు లేకపోవడంతో మెయిన్ గేటు వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. అధికారుల సమన్వయ లోపం వల్ల మందులు తెప్పించకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు సొంత ఖర్చులతో కడపకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు తరగతులు బహిష్కరించి ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. వసతి గృహాల్లో భోజన పదార్థాలు నాణ్యత, వైఫై సదుపాయం మెరుగుపరచాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులు విద్యార్థులు వద్దకు చేరుకుని వినతి పత్రం స్వీకరించి త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ వైవీయూ అధ్యక్షుడు భరత్ సింహా, నాయకులు కిషోర్, గంగన్న, రంజిత్, గౌస్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి లేదాయే!

- ఎనిమిది వారాలుగా అందని వేతనం
- ఉమ్మడి జిల్లాలో రూ.125 కోట్లు చెల్లింపులకు బ్రేక్
- ఆందోళనలో ఉపాధి కూలీలు
- పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉపాధి కూలీల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాట మాడుతున్నాయి. ఆర్నెళ్ల వ్యవధిలో రెండు దఫాలుగా ఇటువంటి పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. రోజూ రెక్కాడితే గానీ కడుపు నిండిన కష్టజీవులకు సకాలంలో కూలి డబ్బులు జమచేయ కపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. 2025-26 మే మొదటి వారం నుంచి జులై మొదటి వారం వరకు కూలి డబ్బులు చెల్లించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉపాధి కూలి డబ్బులపై ఆధారపడి జీవనం గడుపుతున్న కూలీల కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతం. డ్వామా యంత్రాంగం రోజు వారీగా ఉపాధి కూలీ పనిదినాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపిస్తున్నప్పటికీ కూలి డబ్బులను విడుదల చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. 2025-26 మార్చి, ఏప్రిల్ మాసాల్లో లేబర్ వేజెస్, మెటీరియల్ వేజెస్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలుగా విడుదల చేయడంతో ఉపాధి కూలీలతోపాటు సిబ్బంది సైతం ఊపిరి పీల్చుకున్న సంగతి తెలిసిందే.

వైఎస్ఆర్ కడప జిల్లాలో 4,14,858 లక్షల మంది ఉపాధి జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. 3,04,994 లక్షల మంది చురుకుగా ఉపాధి పనులు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని 15 మండలాల్లో 1,39,0725 కుటుంబాలు జాబ్‌కార్డును కలిగి ఉన్నాయి. 2,22,318 మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. కడప జిల్లాలో 2025 ఏప్రిల్ ఒకటి నుంచి మే 10వ తేదీ వరకు 54.79 లక్షల పనిదినాలు చూపించారు. అనంతరం 42 రోజుల పాటు ఉపాధి కూలీలు నిరీక్షిస్తున్నారు. మే 10 నుంచి జులై ఏడవ తేదీ వరకు పనిచేసిన కూలీలకు రూ.90 కోట్లు మేర వేతనాలు రావాల్సి ఉంది. కడప జిల్లాలో రూ.42 కోట్లు, అన్నమయ్య జిల్లాలో రూ.48 కోట్లు కూలి డబ్బులు జమ చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాదికి సంబంధించిన మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.35 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. లేబర్ వేజెస్, మెటీరియల్ కాంపొనెంట్ వేజెస్ వెరసి మొత్తం రూ.125 కోట్లు ఉపాధి హామీ బకాయిలు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో ఒకవైపు ఖరీఫ్, మరోవైపు అకడమిక్ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యం కూలి డబ్బుల అవసరం ఏర్పడింది. జూన్‌లో పంటల సాగు, విద్యార్థుల అడ్మిషన్లు, ఫీజుల ఖర్చులు తడిసి మోపెడవుతున్న సంగతి తెలిసిందే. ఉపాధి కూలి డబ్బులను ఎప్పుడు జమ చేస్తారని ఎదురు చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. నిత్యావసరాల ధరలు దరువు వేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వంట నూనె ధర రూ.150 పైగా పలుకుతోంది. పప్పుల ధరలు కిలో రూ.120 వరకు ఉన్నాయి. ఉపాధి కూలీలు బతకులు దినదిన గండాన్ని తలపిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఉపాధి జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలన్నీ ఉపాధి కూలిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇటువంటి దుర్భర పరిస్థితుల నేపథ్యంలో నెలల తరబడి కూలి డబ్బులు పెండింగ్‌లో పెడితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని పేదలకు కోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కించడం ఏమిటో తెలియడం లేదు. జిల్లాలో వ్యవసాయ పనులు లేని సమయంలో పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెచ్చిన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాల్సి ఉంది.

ఆరు వారాలుగా ఎదురుచూస్తున్నాం

ఉపాధి బిల్లులు కోసం ఆరు వారాలుగా ఎదురు చూస్తున్నాం. గతంలో ఒక వారం పనిచేస్తే మరో వారంలో బిల్లులు వచ్చేవి. ప్రస్తుతం నెలల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. జీవనం సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. ఉదయం, సాయంత్రం పనులు కల్పించాలి. పనిముట్లు కూడా ఉచితంగా ఇవ్వాలి.

- శ్రీరాములు, ఉపాధి కూలీ, మాధవరం, రాయచోటి.

కూలి డబ్బులు త్వరగా చెల్లించాలి

ఉపాధి హామీ పనికి వెళ్లి జీవనం సాగిస్తున్నాను. గతంలో వారానికి ఒకసారి ఇచ్చే వారు. ప్రస్తుతం ఆలస్యం అవుతోంది. వ్యవసాయం పనులు కూడా వెళదామనుకుంటే వర్షాలు లేక వ్యవసాయ పనులు కూడా లేవు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలి.

- సుబ్బమ్మ, ఉపాధి కూలీ, రాయచోటి.

జీవనం ఇబ్బందిగా ఉంది

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతిరోజు కూలి పనులకు వెళుతున్నప్పటికీ సరిగా కూలి డబ్బులు అందడం లేదు. రెండు నెలలకు సంబంధించిన బిల్లులు బ్యాంక్ ఖాతాలో పడతాయని చెప్పినప్పటికీ అవి అందలేదు. ఉపాధి పనులు చేసుకుంటూ జీవించే పేద ప్రజలకు ప్రతివారం నగదు చెల్లిస్తే కుటుంబ పోషణ సులభంగా ఉంటుంది. నెలలు తరబడి బిల్లుల బకాయిలు ఉంటే కష్టతరమవుతుంది .వెంటనే అధికారులు బకాయిలను చెల్లించాలి.

- వీరారెడ్డి, ఉపాధి కూలీ, సిద్ధారెడ్డిపల్లి, చాపాడు మండలం.

పిల్లల భవిష్యత్తుకు
బంగారు బాటలు వేయాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి -వల్లూరు

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బంగారు బాటలు వేయాలని కలెక్టర్ చేకూరి శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గంగాయపల్లి ఆదర్శ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టిందని, మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ అనే బృహత్తర కార్యక్రమం పిల్లల భవిష్యత్తును ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకు దోహదం డతాయని తెలిపారు. పేరెంట్స్ టీచర్స్ మీట్ లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషించాలన్నారు. ప్రణాళికా పద్ధతిలో గైడెన్స్ ఇచ్చి విద్యార్థులు అభివృద్ధి చెందేలా కృషి చేయాలనీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకి సూచించారు. సమాజంలో ఉపాధ్యాయులకు సమున్నత స్థానం ఉందని అన్నారు. ఉపాధ్యాయులు బోధించేటప్పుడు విద్యార్థులు విద్య పైన ధ్యాస ఉంచి వారు చెప్పే అభ్యాసం పైనే దృష్టి కేంద్రీకరించాలన్నారు. వారిలో నైతిక విలువలు పెంపొందించేలా వారి భవిష్యత్తుకు బాటలు వేసే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలనే ఉద్దేశంతో తల్లికి వందనం పథకం అమలు చేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే చైతన్య రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు కష్టపడి మిమ్మల్ని పాఠశాలకు పంపించినప్పుడు వారి తలరాత మార్చే విధంగా విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉజ్వల భవిష్యత్తు పొందాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమగ్ర పురోగతి కార్డులను అందించారు.తల్లికి వందనం కాంపిటీషన్స్‌లో బెస్ట్ పర్ఫామెన్స్ చేసిన విద్యార్థులకు ప్రశంసలు అందజేశారు. విద్యార్థులు అమ్మ పేరు మీద మొక్కలు నాటారు. విద్యార్థులు తల్లికి పాదాభి వందనం చేశారు. కార్యక్రమంలో డిఇఒ శంషుద్దీన్, ఆర్‌డిఒ జాన్ ఈర్విన్ , తహశీల్దార్ శ్రీవాణి, ఎంపిడిఒ రఘురాం, ఎంఇఒ లిల్లమ్మ , విజయ రెడ్డి , ప్రిన్సిపల్ సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, రాఘవరెడి , సునీల్ కుమార్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

- చలో విద్యుత్ సౌదాను విజయవంతం చేయండి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉర్దూ షాదీఖానాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపైన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధ సంస్థ) వేంపల్లె సబ్ డివిజన్ కమిటీ సమావేశం ఎద్దుల మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు విద్యుత్ కార్మికుల సమస్యలపై ఆగస్టు 8న తలపెట్టిన చలో విద్యుత్ సౌదాను కార్యక్రమాన్ని కూడా కార్మికులు అందరూ విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్‌ను కార్మికులకు ఇవ్వాలని కోరారు. అలాగే 2022 పిఆర్ సి, హరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ఆపరేటర్లు అందరికి పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరిని స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని చెప్పారు. ప్రతి విద్యుత్ సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌ను కూడ నియమించాలని పేర్కొన్నారు. అనారోగ్య పాలైన, యాక్సిడెంట్‌కు గురైన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు అన్ లిమిటెడ్ హెల్త్ కార్డులు ఇవ్వాలని చెప్పారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ 10 లక్షల ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కానందున ఆగస్టు 8న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక కాంట్రాక్టు కార్మికుడు ఈ ఆందోళన పోరాటంలో పాల్గొన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎద్దుల మల్లికార్జున రెడ్డి, పులివెందుల డివిజన్ కార్యదర్శి నరేంద్రనాథ్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, కొండారెడ్డి, జనార్ధన్ రెడ్డి, భాస్కర్, కేశవతో పాటు పలువురు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వేంపల్లె సబ్ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సి. సిద్దారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కార్యదర్శిగా చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగభూషణంరెడ్డి, ఇసి గంగిరెడ్డి, కె. రవికుమార్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా సాయిరాంరెడ్డి, గంగాధర్, భాస్కర్, ట్రెజరర్ పి. భాస్కర్ బాబు, కమిటీ సభ్యులుగా రవి, రామచంద్రారెడ్డి, భక్తవత్సల్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, మహీర్ ఆలీ, విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సిద్దారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటంలో ముందు ఉంటానని చెప్పారు. కాంట్రాక్టు విద్యుత్ కార్మికులు అందరూ తనకు సహకరించాలని కోరారు. ఐక్యంగా ఉంటేనే తమ సమస్యలు పరిష్కరం అవుతాయని చెప్పారు.

ఉక్కు కర్మాగార నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి

- కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్
- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జెఎస్‌డబ్ల్యూ గ్రూప్స్ ప్రతినిధులతో కలిసి స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జెఎస్ డబ్ల్యూ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

సీమవాసుల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులపై దృష్టిసారించిందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని సున్నపురాళ్ళ పల్లె వద్ద జెఎస్‌డబ్ల్యూ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఉక్కుకర్మాగారం శిలాఫలకం వేసిన ప్రాంతాన్ని గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి, ఆ కంపెనీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో రెండేళ్ల కిందట 3500 ఎకరాల్లో రూ.8,800 కోట్లతో 30 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు శిలాఫలకం వేశారన్నారు. ఈ కర్మాగార నిర్మాణం తొలిదశ కూడా ప్రారంభం కాకపోవడంతో ఈ ప్రాంతవాసుల కలను సాకారం చేసే దిశగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో. రాష్ట్రంలో దేదీప్యమానంగా వెలుగులు నింపే ప్రయత్నం జరుగుతోందని, అందులో భాగంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డితో కలిసి జెఎస్‌డబ్ల్యూ గ్రూప్స్ ప్రతినిధులతో కలిసి సున్నపురాళ్ల పల్లె సమీపంలో శిలాఫలకం వేసిన ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. గతంలో జిందాల్ గ్రూపు సంస్థకు గత ప్రభుత్వం దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన భూములను కేటాయింపు, ఒప్పందాలు, ప్రస్తుత పరిస్థితులు, పరిశ్రమ నిర్మాణానికి కావాల్సిన అనుకులతలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మొదలైన అంశాలపై కంపెనీ ప్రతినిధులతో చర్చించామని చెప్పారు. కాగా 2019లో ఎపి హైగ్రేడ్ స్టీల్స్ పేరుతో ఒకసారి, 2023లో మరోసారి శంకుస్థాపన చేశారన్నారు. తదుపరి రెండేళ్లు ఎలాంటి నిర్మాణ పనులు జరగలేదని తెలిపారు. . రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నానికి కార్యరూపం ఇచ్చే దిశగా ప్రస్తుత ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కర్మాగారం నిర్మాణం కార్యరూపం దాల్చితే. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వడం, వేలాది మంది యువతకు మెండైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందనున్నాయన్నారు. ఆయనతోపాటు జెఎస్‌డబ్ల్యూ స్టీల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యోగేష్ బేడీ, జి.ఎం.వికాస్ కన్వర్, సీనియర్ వైన్ ప్రెసిడెంట్ రాజేష్ పూరి, టెక్నికల్ హెడ్ పురుషోత్తం ప్రసాద్, లైజనింగ్ కార్పొరేట్ హెడ్ కనకరావు, హెచ్ఆర్ హెడ్ఎ సుదర్శన్, ప్రాజెక్టు హెడ్ షేక్ నూరుల్, ఆర్డీవో సాయిశ్రీ, స్థనిక యువనాయకులు భుపెద్ రెడ్డి, ఎపి ఐసి జెడ్ఎం శ్రీనివాస మూర్తి, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోసం 18న చలో ఢిల్లీ

- కడప ఉక్కు పరిశ్రమ శంకుస్థాపనలకే పరిమితమా?
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని ప్రధాన అంశం అయినటువంటి కడప ఉక్కు పరిశ్రమ హామీలను కేంద్రం పూర్తిగా విస్మరించిందని, వీటి అమలు సాధన కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, విరణాల శివకుమార్ తెలిపారు. గురువారం చలో ఢిల్లీ పోస్టర్లను కడపలో ఐటిఐలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమకు వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలం చెందిందన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా చట్టబద్ధంగా రాసుకున్న కడప ఉక్కు పరిశ్రమకు కేంద్రం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడం చూస్తే ఈ ప్రాంతం పై ఉన్నటువంటి వివక్షత స్పష్టంగా అర్థం అవుతుందని పేర్కొన్నారు. కడప ఉక్కు పరిశ్రమ వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా రాయలసీమ చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా కరువు తో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత ప్రజలకు వలసలు వెళ్లడం తగ్గుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కడప ఉక్కు పరిశ్రమ ఒక టెంకాయ కొట్టే పరిశ్రమగా, శంకుస్థాపన పరిశ్రమగా చూస్తున్నారే తప్ప పనులు ప్రారంభించే పరిశ్రమగా ఎవరు ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా 10 రోజులలో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని చెప్పి నేటికి నెల గడిచిన ఇంతవరకు ఉక్కు పరిశ్రమ జాడే కనిపించడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తో కీలకంగా ఉన్నటువంటి సందర్భంలో కడప ఉక్కు పరిశ్రమ, విభజన హామీల అమలు సాధన ఇప్పుడే సరైన అవకాశం ఉంటుందన్నారు. కానీ ఆ రీతిలో రాష్ట్ర ప్రభుత్వం విభజన హామీలు, కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం తన వంతు పాత్ర పోషించడం లేదని చెప్పారు. కేవలం ఎపిఅంటే అమరావతి, పోలవరం అన్నట్టుగా నిధులు అభివృద్ధి అంతా ఆ స్థాయిలోనే ప్రభుత్వం చూస్తుందని పేర్కొన్నారు. ప్రధాన హామీలు అయినటువంటి రాయలసీమ ప్రాంతాన్ని విస్మరిస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి కడప ఉక్కు నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. పనులు ప్రారంభించాలని ఇక్కడ యువతకు ఉపాధి అవకాశాలు తీసుకువచ్చి వలసల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాజు, మణికంఠ, ఇస్మాయిల్, బషీర్, ఇబ్రహీం పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్‌పి

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్ సూచించారు. గురువారం శ్రీ అరుణాచల హాస్పిటల్, శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్‌లో పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షల శిబిరాలను ప్రారంభించారు స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుండె, లివర్, కిడ్నీ, బి.పి, షుగర్‌తో పాటు 20 రకాల వైద్య పరిక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 రోజుల పాటు జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఈ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నిరంతరం విధులు నిర్వర్తించే పోలీసులకు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కంటి చూపు సమస్యలు వంటివి ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు. ఇది సకాలంలో చికిత్స అందించడానికి, సమస్యలు తీవ్రతరం కాకుండా నిరోధించడానికి సహాయపడుతుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న సిబ్బంది తమ విధులను మరింత సమర్ధవంతంగా, ఉత్సాహంగా నిర్వర్తించగలరన్నారు. కేవలం సిబ్బంది ఆరోగ్యం మాత్రమే కాకుండా, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే సిబ్బంది మనశ్శాంతిగా విధులు నిర్వర్తించగలరని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్.పి బి.రమణయ్య, ఏ.ఆర్ డి.ఎస్.పి శ్రీనివాసరావు, డి.టి.సి డి.ఎస్.పి అబ్దుల్ కరీం, అరుణాచల హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు ఆర్.నిరంజన్ రెడ్డి, ఏ.ఓ కోటిరెడ్డి, శ్రీ శ్రీ హెూలిస్టిక్ హాస్పిటల్ సి.ఈ.ఓ శరత్ బాబు, మేనేజర్ హరినాథ్, కడప వన్ టౌన్ సి.ఐ రామకృష్ణ, ఆర్.ఐ లు టైటస్, వీరేష్, శ్రీశైలరెడ్డి, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈ.సి మెంబర్స్ మాధవీలత, ఏప్రిన్ పాల్గొన్నారు.

బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులు

ఆర్ట్స్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల కళాశాల వ్యవస్థాపక దినోత్సవర్గా గురుపూజోత్సవ కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు పతకాలు బహుకరించారు. ఈ సందర్భంగా కళాశాలలో పనిచేసిన పూర్వ గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన కృష్ణాజిల్లా విశ్రాంత కలెక్టర్ కె.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల సంఘం ఇతోధికంగా కృషి చేస్తోందని కొనియాడారు. బంగారు పతకాలు అందించిన దాతలకు ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. పూర్వవిద్యార్థుల సంఘం బాధ్యులు ఆచార్య పుత్తా రాజశేఖర రెడ్డి, డాక్టర్ ఎం. సి.వెంకటసుబ్బయ్య, టి.వి.. సుబ్బారెడ్డి, సి పి డి సి సభ్యులు చిన్నపరెడ్డి హాజరయి ప్రసంగించారు. కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి డా.శివరాం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల పూర్వ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ జువాలజీ లెక్చరర్ డాక్టర్ ఎం.సి . వెంకటసుబ్బయ్య జీవశాస్త్ర విభాగానికి లక్ష రూపాయల ఎండోమెంట్ ప్రైజ్ ప్రకటించారు.

పత్రికా స్వేచ్ఛపై దాడిని సహించలేం : డిసిసి

ప్రజాశక్తి - కడప

బంగారుపాళ్యం మండలంలో విధులు నిర్వర్తిస్తున్న పత్రిక ఫోటోగ్రాఫర్‌పై వైసిపి నాయకులు చేసిన దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. మీడియా ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభం, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చే పాత్రికేయులపై ఇలా దాడి చేయడం అసహనపూరితమైన చర్య అన్నారు. తాము ఇంతే అని వైసిపి నేతలు మరోసారి నిరూపించుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరుతున్నామని చెప్పారు. పాత్రికేయుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు.

సిఇకి సమస్యను విన్నవిస్తున్న కార్మికులు

జీతాలు ఇవ్వాలని కోరుతూ
ఆర్‌టిపిపి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మండలంలోని ర్థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్టిపిపి) స్టేజ్2 లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు జీతాలు ఇవ్వాలని కోరుతూ సిఇ కార్యాలయం వద్ద గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఇందుకు పలు కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. ఆర్టిపిపిలో 8 సర్కిళ్ళ సంబంధించి సుమారు 1500 మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఒక సర్కిల్‌కు చెందిన 120 మందికి జీతాలు వారి ఖాతాలలో పడలేదు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ఒకటో తారీకున చెల్లించాల్సిన జీతాలు పదో తేదీ వచ్చినా కూడా ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, అది కూడా సమయానికి ఇవ్వకుంటే ఎలా అని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్య తీరు మారాలని అన్నారు. ఈ నిరసనకు సిఇ వాసుదేవరావు స్పందించారు. రేపటిలోగా జీతాలు కార్మికుల ఖాతాలలో జమ చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు సుబ్బిరెడ్డి, మహేహర్, శివయ్య, సాంబశివరెడ్డి, ఓబులేసు, రాము, శివ మనోహర్ రెడ్డి, సత్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రాధాకృష్ణవేణి

ఎంపిటిసిలకు ఏడాదిగా జీతాల్లేవు

- నిధులు, ఖర్చులు, మిగులు వివరాలు తెలపాలి
- ఎంపిడిఒను కోరిన ఎంపిటిసిలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎంపిటిసిలకు ఏడాదిగా జీతాల్లేవని, మండలానికి మంజూరైన నిధులు, ఖర్చులు, మిగులు వివరాలు తెలపాలని కోరాపాడు ఎంపిటిసి వెన్నపూస పుష్పలత ఎంపిడిఒ రాధాకృష్ణవేణిని కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సభా భవనంలో గురువారం ఉప మండల అధ్యక్షులు పాలగిరి వీర రేణుక అధ్యక్షతన రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఎంపిటిసిలకు సంబంధించి మూడు నెలల జీతాలు బిల్లు పెట్టినట్లు తెలిపారు. మండల గ్రాంట్ మిగులు రూ. 1,34 లక్ష ఉన్నట్లు చెప్పారు. స్థానిక మేజర్ పంచాయతీలోని ఎల్.ఎమ్ కాంపౌండ్, ఆర్టిపిపి రోడ్డు, ఎస్.వి. గిరి కాలనీ వాసులు తాగేందుకు గండికోట జలాశయం నీరు సరఫరా చేయాలని ప్రజలు అడుగుతున్నట్లు పాత్రికేయులు అధికారుల దృష్టికి తెచ్చారు. గండికోట జలాశయం నీటిని పైపులైన్ ద్వారా ముద్దనూరులోని వాటర్ ట్యాంకులు, సంపులకు సరఫరా చేసి నిల్వ ఉంచుతామని, కాలనీలకు పంచాయతీ తరపున పైపులైన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరీష్ తెలిపారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సర్పంచులు ,ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ నిర్వహించారు. ఈనెల 25 వరకు నిర్వహించే శిక్షణకు సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ వి. శిల్పకళ నిర్వహణ కర్తగా వ్యవహరిస్తారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వవసయ పరిశోధనాస్థానం అధిపతి డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పోషకాలు వాటి విలువలు తెలిసినపుడే, వ్యవసాయంలో ఎరువుల వాడకం అనేది ఖచ్చిత మైన విధంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఏయే పంటలకు ఎంతశాతం ఎరువులు అవసరమో శిక్షణ ద్వారా అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమం సహకార సంఘాలు మరింత బలోపేతం అవడానికి సహాయ పడుతుందని చెప్పారు. శిక్షణ పొందిన సిబ్బందికి కూడా వారి ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి దోహదపడుతుందన్నారు. పంటలకు ఎంత శాతం ఎరువులు అవసరమో ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా అందరు తెలుసుకోవాలని వివరించారు, నిష్ణాతులైన శాస్త్రవేత్తల చే శిక్షణ తరగతులు, ప్రాక్టికల్స్ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు ఐ. సురేష్ కుమార్ రెడ్డి, ఎస్. మానస, గిరీష్ కుమార్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సోమాపురం గ్రామ సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు గురువారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శి పద్మావతి, డిజిటల్ అసిస్టెంట్ ప్రతాప్ యాదవ్‌తో కలిసి గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రైతు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఇంత కాలం సోమాపురం గ్రామ సచివాలయంలో సోషియల్ వెల్ఫేర్ సుదర్శన్ రెడ్డి, ఇంజినీర్ అసిస్టెంట్ గా ఆలీ, మహిళా పోలీస్ కళావతి, ఎఎన్ఎం రెడ్డి కుమారి, అగ్రికల్చరల్ అసిస్టెంట్ పుష్పలత ప్రజలకువ విశేష సేవలు అందించారని చెప్పారు. చాలా క్రమశిక్షణతో పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించడం గర్వకారణమని అన్నారు. ఎక్కడికి వెళ్లినా ఇలాగే ప్రజలు సమస్యలు పరిష్కరించి వారి మన్ననలు పొందాలని ఆకాక్షించారు. తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మీదేవి, పోలు వెంకటరామిరెడ్డి, మీసాల వెంకటసుబ్బయ్య , పెద్దన్న పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఒక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. ముదునూరు రోడ్డులో టిఎంఆర్ మాల్ వెనకాల ఆవుల కృష్ణ కుటుంబం నివాసం ఉంటున్నారు. హమాలి పని చేసుకుంటున్న ఆయన వయసు మీద పడడంతో నాలుగు సంవత్సరాలుగా హమాలీ పని వదిలేశాడు. హమాలి పని చేస్తున్నప్పుడు మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బంది ఏర్పడింది. గురువారం తెల్లవారు జామున సమయంలో రైల్వే స్టేషన్ కు వెళ్లి గూడ్స్ రైలు కింద తల ,చేతులు పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-చక్రాయపేట

వేంపల్లి-రాయచోటి రహదారిలో గండి- అద్దాల మర్రిక్రాస్ మధ్యలో గురువారం శనిగ కట్టే తీసుకొని వెళుతున్న ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి కిందపడింది. ఆసమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ సంఘటనతో వేంపల్లి-రాయచోటి రహదారిలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు తల్లిదండ్రులే : జెసి

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెసి అదితిసింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు తల్లిదండ్రులే అని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వం పేరెంట్, టీచర్ల సమావేశాలను అత్యంత ప్రధాన్యతతో నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. గురువారం కడప నగరపాలక ఉన్నత పాఠశాల (మెయిన్స్) లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి జెసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశ సభలో ఆమె మాట్లాడుతూ సమాజానికి సరైన చదువు ఇవ్వకపోతే అభివృద్ధికి కళ్లెం వేసినట్లే అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు పాఠశాల ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రుల బాధ్యత చాలా అవసరమన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం మౌలిక వసతులే కాకుండా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను, సత్ ప్రవర్తనను నేర్పించే ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అందుకోసం పాఠశాల నిర్వహణ కమిటీలను పటిష్టంగా నిర్వహిస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తుందని తెలిపారు. ముందుగా అత్యధిక విద్యార్థుల సంఖ్య ఉన్న కడప మున్సిపల్ (మెయిన్) హై స్కూల్ లో పలు పాఠశాల తరగతి గదులు, పాఠశాల ఆవరణాన్ని, మోడల్ సెంట్రల్ కిచెన్ ను జెసి పరిశీలించారు. ప్రస్తుత విద్యా విధానం, సిలబస్, పరీక్షల నిర్వహణ మొదలైన అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలను వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ముందుగా "తల్లికి వందనం" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పాదాభివందనం, పుష్పఅర్చన్లు చేయగా తల్లులు పిల్లలను దీవించారు. తదనంతరం తల్లుల ఉత్తమ రచనల పఠనం, ఉత్తమ విద్యార్థుల, పూర్వ విద్యార్థుల ప్రసంగం, విద్యార్థుల ప్రశ్నలకి ముఖ్య అతిథిలతో సమాధానాలు ఇచ్చారు. అనంతరం కడప మున్సిపల్ కార్పొరేషన్ వారి ద్వారా పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అతిథులందరితో కలిసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చివరగా తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని అతిథులు భోంచేశారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఓ జాన్ ఇర్విన్, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, కార్పొరేటర్ సూర్యనారాయణ, ఎంఇఒలు గంగిరెడ్డి, ఇర్షద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ , హెచ్ ఎం ముబీనా రెహ్మాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చాపాడు :** తల్లిదండ్రులు తరచుగా పాఠశాలలకు వస్తే విద్యార్థుల నడవడికను తెలుసుకోవచ్చని మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని హెస్కూల్‌లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్ 2.0లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో ప్రధానో పాధ్యాయులు నాగలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామకుమారి, ఎంఇఒ రవిశంకర్, ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమని ఎంపిటిసి సభ్యులు చంద్ర భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పేరా రెడ్డి కొట్టాలు వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో తల్లిదం డ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవ రణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్ర మంలో టిడిపి నాయకులు ఓబులు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో గురువారం ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు పాటలు పాడి నృత్యాలుతో అలరించారు.ఎ్ లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కలు నాటారు. తల్లిద ండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కాశినాయన :** విద్యార్థులు చదివి ఉన్నత స్థాయికి రావాలంటే తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమని నరసాపురంలోని ఎపి మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య పేర్కొన్నారు తల్లిదండ్రుల ఆత్మీయ సమా వేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పుష్ప, ఎంఇఒ నిర్మల, రెండు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **వేంపల్లె :** ప్రతి విద్యార్థికి లక్ష్యం అనేది ఉన్నప్పుడే భవిష్యత్తులో రాణిస్తాడని, కాబట్టి చదువుకొనే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదవాలని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ రవి, కళాశాల కమిటీ చైర్మన్ అబ్దుల్ గఫూర్ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ సమావేశాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు మెమోంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో టిటిడి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ అలీ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధం చదువు మాత్రమే అని చక్రాయపేట తహశీల్దార్ విజయ కుమారి అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.రంతుబాషా ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహశీల్దార్ తోపాటు ఎఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, ఎంపిటిసి ఇందుకూరి లీలావతమ్మ, సర్పంచ్ హర్షద్ బాష, పంచాయతీ సెక్రటరీ విజయ కుమార్ నాయక్, హాజరయ్యారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హరినాథ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్ ఎస్ షర్మిల రాణి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో , ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం కనివిని ఎరుగని రీతిలో నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన రెడ్డి శంకర్ విద్యార్థికి బహుమతి అఅందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన సింహాద్రిపురం జెడ్‌పి హైస్కూల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు విద్యా మిత్ర బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మురళీధర్, ఎంఇఒ ఓబులేసు, హెచ్ఎం సతీష్ కన్నా, ఇఒపిఆర్‌డి వెంకటరాముడు, విద్యార్థులు పాల్గొన్నారు. **చాపాడు (మైదుకూరు):** పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర తెలిపారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇలియాస్ అహమ్మద్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల, విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వి ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్ వెంకట రాముడు, ప్రిన్సిపల్ తిరుమలష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక పట్టణంలోని హోమస్‌పేటలోని అనిబిసెంట్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న 250మంది విద్యార్థులకు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు చిప్పగిరి ప్రసాద్, అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. **చెన్నూరు :** ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్ఆర్ ఇంగ్లీష్ మీడియ స్కూల్లో తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి పరమేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల:** సమయం వృథా చేయకుండా విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని జడ్‌పిహెచ్ బాలుర పాఠశాలలో గురువారం మెగా పేరెంట్, టీచర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శేషఫణి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, తహశీల్దార్ శోభన్ బాబు, ఎంపిడిఒ వెంకటరమణయ్య, ఎంఇఒ శివప్రసాద్, ఎంఇఒ 2, హెచ్ఎం రామాంజనేయుల రెడ్డి, ఉపాధ్యాయులు చంద్ర ఓబుల రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వేముల :** ప్రతి విద్యార్థికి లక్ష్యం అనేది ఉన్నప్పుడే భవిష్యత్తులో రాణిస్తారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థ సారథి రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్‌పిహెచ్ఎస్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ దక్షిణమూర్తి, ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దక్షిణ మూర్తి, కళాశాల చైర్మన్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమాన్ని మారుతీ నగర్ లోని నాగార్జున మోడల్ స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ ఎం. శివశంకర్‌రెడ్డి ప్రిన్సిపల్, ఇన్చార్జి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఐఐటి, ఎన్ఐటీలలో సీట్లు సాధించిన పూర్వ విద్యార్థు లను సన్మానించి, జ్ఞాపికలను బహుకరించారు. విద్యార్థులు తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా వారి తల్లిదండ్రుల పాదాలకు నమస్కారం చేసి తమ విధేయతను చాటుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్ర మాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణవేణి, సమీరా, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బోధన్యత సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకుండా వేధించడం సరికాదు

నిరసన తెలియజేస్తున్న బాధితురాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సర్కారు రోడ్డులో తిరగకుండా అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోకుండా, తమల్ని వేధించడం సరికాదని పెద్ద శెట్టిపల్లికు చెందిన ఝాన్సీ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహిళా సంఘాలను కలుపుకొని నిరసన వ్యక్తం చేశారు. పెద్ద శెట్టి పల్లె ఎస్‌సి కాలనీకి చెందిన మేరీ ఝాన్సీ మాట్లాడుతూ 2015లో ప్రభుత్వ స్థలంలో పంచాయితీ పాలకవర్గం తీర్మానం చేసి రూ. 97 వేలతో సిసి రోడ్డును ప్రభుత్వంలో సిసి రోడ్డును తన ఇంటి వరకు వేయాలని అప్పట్లో సర్పంచ్‌గా ఉన్న వెంకటసుబ్బయ్య తీర్మానించి మోసం చేశారన్నారు. కొందరు రోడ్డు వేయకుండా వదిలేసిన రెండు అడుగుల స్థలం తమది, ఈ రోడ్డులో మీరు తొరగొద్దని దౌర్జన్యం చేస్తూ రోడ్డుకు అడ్డుగా గోడ నిర్మించారని ఆమె వాపోయారు. మహిళా నాయకురాలు వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ ప్రజలు కడుతున్న పన్నులతో జీతాలు తీసుకొని బాధితులను అన్యాయం చేస్తూ పోలీసు స్టేషన్ చుట్టూ రోజుల తరబడి తిప్పుకోవడం సరైంది కాదన్నారు. సమస్య పరిష్కరించకుంటే రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర ధర్నాకు కూర్చుంటామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పద్మ,అమరావతి, కళావతి,యేసు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్యానల్ న్యాయవాదులు

మధ్యవర్తిత్వంపై అవగాహన

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు మొదటి అదనపు జిల్లా జడ్జి, ఇన్‌ఛార్జి డి ఎల్ ఎస్ఎ చైర్మన్ ఎల్. వెంకటేశ్వరరావు సూచనల మేరకు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి,డి ఎల్ఎస్ఎ సెక్రటరీ కె.ప్రత్యూష కుమారి గురువారం కడప కోర్టు ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ స్టాల్‌లో మధ్యవర్తిత్వం సంబంధించి కరపత్రాలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రజలకు కరపత్రాలు పంచారు. ఆర్‌టిసి, కలెక్టరేట్, రైల్వేస్టేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్, డిఎస్‌పి కార్యాలయం, సంధ్యాసర్కిల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, పాత బస్టాండ్ సర్కిల్, సెవెన్ రోడ్ సర్కిల్, దిశా పోలీస్ స్టేషన్ మొదలగు ప్రాంతాలలో ఫ్లెక్సీలను, బ్యానర్లను ప్రదర్శించారు. మధ్యవర్తిత్వానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు సుబ్రహ్మణ్యం, హసీనా, పారా లీగల్ వాలంటరీలు దశరథ రామిరెడ్డి, ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి 'కూటమి'తోనే సాధ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అందిస్తుందని మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పిలుపు మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 37వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకుంటూ, ఏడాదిగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అయినా తొలి సంవత్సరంలోనే ఇచ్చిన హామీలన్నీ పూర్తి స్థాయిలో అమలు చేయడం సాధ్యం కాదని చెప్పారు. కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, అమరావతి, పోలవరం, ఒకవైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి చేస్తోందని వివరించారు. వీటితో పాటు సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబిబుల్లా, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, స్థానిక నాయకులు వద్ది బాలుడు, బోగా శివకళ్యాణి, గంజికుంట అంజి, సిద్దయ్య, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

- వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

ఒక పంటకు కూడా గిట్టు బట్టు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని ఆదుకోవాలని జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలల పూర్తి అవుతుంది అన్నారు. చంద్రబాబు నాయుడు మన తలలు తాకట్టు పెట్టి అప్పు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబు వచ్చాడంటే బోనస్‌గా కరువు వస్తుందని ఎద్దేవ చేశారు. ప్రస్తుతం రాష్ట్రం కరువుతో విలవిలాడుతుందని చెప్పారు. ఏ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, దీంతో దళారులు విచ్చలవిడిగా దోపిడీకి దిగారని వాపోయార. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఒక్క రైతును ఆదుకున్నారని గుర్తు చేశారు. అందుకోసం ప్రతిపక్ష పార్టీగా రైతులు పడుతున్న కష్టాలను చూసేందుకు వెళ్తే అక్కడ పోలీసు ఆంక్షలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. వాళ్ళ గోడు చెప్పుకోడానికి రైతులు తరలి వస్తే వాళ్లనే రౌడీలు అంటారా అని ప్రశ్నించారు. పార్టీ నాయకులను, కార్యకర్తలులను పోలీసు లాఠీలతో చితక బాధారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా జగన్మోహన్ రెడ్డి మీద అబిమానం, ప్రజాదరణ ఆపలేరన్నారు. బంగారుపాళ్యంలో దండుపాళ్యం అంటూ కొంతమంది అడ్డంగా రాతలు రాస్తున్నారు, రైతులు నైరాశ్యంతో రోడ్డు మీద మామిడి వేస్తే, జగన్నాటకం అంటున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని పేర్కొన్నారు. అర్హులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కర్నూలుపై చిత్తూరు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప : ఎసిఎ సౌత్ జోన్ అండర్-19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో గురువారం నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై ఏడు వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 282 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 251 పరుగులు చేసింది. కర్నూలు జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 71.2 ఓవర్లలో 272 పరుగులు చేసింది. ఆ జట్టులోని హృదయ్ 85, విఖ్యాత్ 85 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని కె. ఘని 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 42.2 ఓవర్లలో మూడు వికెట్లు నష్టానికి 304 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 138 పరుగులు చేశాడు.

వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, అనంతపురం జట్ల మధ్య నిర్వహించిన వేరొక మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 495 పరుగులు చేసింది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ఃలో 250 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా 74 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 107.0 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 455 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 133, అర్థిత్ రెడ్డి 111 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని వరుణ్ సాయి నాయుడు 4 వికెట్లు తీసుకున్నాడు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి- ఖాజీపేట

స్థానిక మైదుకూరు రోడ్డులోని సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాధుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. **చాపాడు :** గురు పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మీపేటలో సాయిబాబా గుడి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ మాజీ, ఎంపిపి డి.గురివిరెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. తహశీల్దార్ రమాకుమారి, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారెడ్డి, కెసి కెనాల్ ఎఇ గురు మోహన్ రెడ్డి, అధికారులు, ప్రజలు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. **మైదుకూరు :** గురు పౌర్ణమి సందర్భంగా కడప రోడ్డులోని కొత్త సాయిబాబా గుడి, పాత సాయిబాబా గుడి, వనిపెంట రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. **ఖాజీపేట :** ప్రతి ఒక్కరూ విద్య నేర్పిన గురువును గౌరవించి, వారి నుంచి ఆశీస్సులు పొందినప్పుడే వృద్ధి లోకి రానిస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ బయో కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వర రెడ్డి, డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్య శర్మ, మండల ఎఒ నగార్చన అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో గురు పౌర్ణమి వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్ పాల్గొన్నారు **వేముల :** మండలంలోని మీది పెంట్ల గ్రామపంచాయతీ భూమయ్య గారి పల్లెలో గురు పౌర్ణమి వేడుకలు జడ్‌పిటిసి కోకటం వెంకట బయపురెడ్డి ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో కోలాటం,చెక్కభజన కార్యక్రమం ప్రజలను ఆకట్టుకున్నాయి.గురు పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు, సాయినామస్మరణంతో మారుమ్రోగాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరామ్ రెడ్డి ,గ్రామస్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE Addl. SENIOR CIVIL JUDGE, KADAPA

I.P.No. 34/2025

1) Tanduru Badulla Sab
2) Tanduru Apsara
M.J.Kunta, Kadapa Dist. **...Petitioners**

Vs

1) B. Suresh Babu S/o Veera Badraiah, D.No.42/822, M.J.Kunta, Kadapa Town, Phone Number: 9989867440.
2) P. Siddaiah S/o Babu Sab, D.No.7/886-7,M.J.Kunta,Kadapa Tow n, Phone Number: 7675856694.
3) Kathi Mahesh, D.No.42/713-4, M.J.Kunta, Kadapa Town, Phone Number: 9392144304.
4) Palagiri Siddiq S/o Siddaiah, D.No.42/307-3-2-2, Bhagyanagar colony, Kadapa town, Phone number: 7780704922.
5) Rachmallu Narayana, D.No.42/477-6, Bhagya nagar colony, Kadapa town, Phone number: 9866714860.
6) S. Sowjanya, D.No.41/1254, Sabhapathi Road, Co-operative colony, Kadapa town, Phone Number: 7675080137.
7) P. Swarnalatha Devi, D.No.42/476-4, Bhagya nagar colony, Kadapa town, Phone number: 9398525497.
8) Shaik Mahaboob Basha, D.No.42/736-2, M.J.Kunta, Kadapa Town, Phone Number: 9347422514.
9) Shaik Abdullah, D.No.42/810-18, M.J.Kunta, Kadapa Town, Phone Number: 7675856694.
10) C. Baba Fakruddin, S/o Peerusab, D.No.42/776-5-2, M.J.Kunta, Kadapa Town, Phone Number: 7675856694.
11) Ramasubbamma W/o Santaiah, D.No.2/156-3, Rajareddy Street, Kadapa town. No phone Number.
12) Venkata Subba Reddy, resident of Om Shanthi Nagar, Kadapa town, Phone Number: 900085533.
13) Reddaiah, resident of Om Shanthi Nagar, Kadapa town, Phone Number: 9398627747.
14) Bajaj Finance, Kadapa, No phone number.
15) Union Bank, Kadapa, No phone number.
16) Subbarayudu, resident of D.No.42/751, M.J.Kunta, Kadapa Town, No Phone Number.
17) S. Babaiah, resident of 42/765-5, M.J.Kunta, Chinnachowk, Kadapa Town and District, Phone Number:9052621864.

...Respondents

NOTICE

Please take this notice that the above insolvency petition filed by the petitioner praying the Hon'ble court to declare him as an insolvent against respondents No.1 to17 and case stands posted on 28.07.2025 for appearance of No.6, 9, 12, 16 and R17 of you before the Hon'ble court at 10.30 AM either by yourself or through your advocates failing which the matter will be decided in your absence.

//By Order of the Court//
P. PRABHAVATHI
Advocate for Petitioners, KADAPA.